భగ్గుమంటున్న అగ్గితెగులు

- పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- వరిని ఆశిస్తున్న తెగులు


మెండోరా మండలం వెల్కటూర్‌లో అగ్గితెగులు సోకిన వరి పంట

బాల్కొండ: యాసంగిలో సాగవుతున్న వరి పంటలో అగ్గి తెగులు వ్యాపిస్తోంది. గత వారం రోజుల క్రితం నుంచి రాత్రి వేళ ఉష్ణోగ్రతలు తక్కువ కావడంతో వరి పంటకు అధికంగా తెగుళ్లు సోకుతున్నాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో గత నెల రోజుల క్రితం నుంచి వరి నాట్లు వేస్తున్నారు. ముందుగా నాట్లు వేసిన వరి పంటకు అగ్గి తెగులు సోకుతుంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అగ్గి తెగులు సోకడంతో వరిపైరు ఆకులపై ఇటుక పొడి రంగులో మారుతుంది. శంకు ఆకారంలో మచ్చలు ఏర్పడుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే అగ్గి తెగులు అధికంగా వ్యాప్తి చెందుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లు వేసినప్పటి నుంచే వరి పంటకు క్రిమి సంహారక మందులు వినియోగించాలంటే పెట్టుబడి తడిసి మోపెడవుతుందని రైతులు వాపోతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గడం, యూరియా అధికంగా వినియోగించడం వలన అగ్గి తెగులు వ్యాపిస్తుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. యూరియాను అధికంగా వినియోగించొద్దని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

> **నివారణ చర్యలు..**
> వరి పంటలో అగ్గి తెగులు నివారణ కోసం పలు నివారణ చర్యలను వ్యవసాయాధికారి సూచించారు. పంటలో అగ్గి తెగులు సోకితే ముందుగా వరిపంటను ఆరబెట్టాలి. ట్రైసైక్లోజన్ 120 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. ప్రధానంగా వరి నాట్లు వేసిన 20 రోజుల సమయంలో ఎక్కువగా యూరియాను వాడొద్దు. ట్రైసైక్లోజన్ పిచికారి చేసిన 20 రోజుల వరకు యూరియా వేయవద్దు. రైతులు సకాలంలో అప్రమత్తమంగా ఉండాలి.
> – బద్దం లావణ్య, బాల్కొండ వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

మంత్రి జూపల్లిని కలిసిన నిరుద్యోగులు


వినతి పత్రం అందజేస్తున్న మహిపాల్

నందిపేట్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ ఆధ్వర్యంలో నిరుద్యోగులు కలిసి వినతి పత్రం అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్ పరీక్షల ఫలితాలు విడుదల చేసి ఉత్తీర్ణులయిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి హెల్త్ చీఫ్ సెక్రటరీతో మాట్లాడి ఫలితాలు విడుదల చేయాలని సూచించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్‌లు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలని వినతి


కోటగిరిలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోటగిరి (రుద్రూర్): కోటగిరి మండల కేంద్రంలో కబ్జాకు గురవుతున్న భూములను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలకు సరిహద్దులు నిర్ణయించి స్వాధీనం చేసుకోవాలని కోరారు. కబ్జా చేసిన ప్రాంతాల్లో సెలవు దినాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వీటిని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోహన్‌రావ్, నవీన్, శ్రీనివాస్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శిగా పోచిరాం


పోచిరాంను సన్మానిస్తున్న నాయకులు

బోధన్: పోతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామానికి చెందిన పోచిరాం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జిల్లా సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లాకేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి మాదిగ, కనక ప్రమోద్ మాదిగల సమక్షంలో ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కోటగిరిమండల కేంద్రంలో పోచిరాంను నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర నాయకుడు దావులయ్య, మండల ప్రతినిధులు కన్నం శ్రీనివాస్, దినేష్, శ్రీకాంత్, విజయ్, సాయిలు, ఆర్టీసీ సాయిలు, గ్వాయక్వాడ్ రాము, రాజయ్య, రాములు, నాగేష్, రవీందర్, భూమయ్య, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం


బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ రవీందర్

రెంజల్/నవీపేట్: వేసవిలో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ఆర్. రవీందర్ పేర్కొన్నారు. నవీపేట్ మండలంలో నూతనంగా నిర్మించిన పనులను ప్రారంభించారు. రూ. 40 లక్షల వ్యయంతో జన్నెపల్లి, కమలాపూర్ సబ్‌స్టేషన్‌లను కలుపుతూ 6.5 కిలోమీటర్లలో నూతనంగా నిర్మించిన 33 కేవీ లైన్‌తో పాటు రూ. 17 లక్షలతో 11 కేవీ బ్రేకర్‌లను ప్రారంభించారు. నాళేశ్వర్–నిజాంపూర్ సబ్‌స్టేషన్‌లను సందర్శించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏడీఈ ప్రశాంత్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్‌లతో పాటు నాళేశ్వర్, నిజాంపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


బాల్కొండలో మాట్లాడుతున్న అశ్విత

బాల్కొండ: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నాయకులు ముమ్మరంగా చేస్తున్నారు. బాల్కొండ మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో పట్టభద్రుల బీజేపీ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి కుమార్తె అశ్విత మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఎలా ముందుకు పోవాలో వివరించారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు అంబటి నవీన్, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు నర్సయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.
మాక్లూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేయించాలని బీజేపీ ఎమ్మెల్సీ జిల్లా కన్వీనర్ డాక్టర్ కొండ ఆశన్న అన్నారు. సోమవారం మండలంలోని మాదాపూర్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు మదారి మమత రాజేశ్వర్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విశ్వప్రకాష్‌బాబు, కలిగోట గంగన్న, సీనియర్ నాయకుడు గంగోనే సంతోష్, అనిల్‌కుమార్, పార్టీ మాజీ అధ్యక్షుడు సురేష్‌నాయక్, చింత ప్రవీణ్‌రెడ్డి, గంగోనేవినోద్, రాథోడ్ రాజశేఖర్, రాజేందర్‌రెడ్డి, బి రమేష్, హన్మాగౌడ్, మహేష్, శివకుమార్, డి రమేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా


మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని ఇబ్రహీంపూర్ శివారులో ఏర్పాటుచేసిన ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులంతా కలిసి తమ శివారులో ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్లా రామ్మోహన్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, మల్కారెడ్డి, శంకర్ నాయుడు, నారాయణ చౌదరి, తదితరులున్నారు.

మాధవ సేవకంటే మానవ సేవ ముఖ్యం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కోటేశ్వర్‌రావు

బోధన్‌టౌన్(బోధన్): అన్ని మతాలకు చెందిన వారు మానవ సేవ చేయడానికి లయన్స్ క్లబ్ గొడుగు కిందికి చేరుతారని సినీ నటుడు మనం కోటేశ్వర్‌రావు అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320 డీ ఆధ్వర్యంలో సుమ ధరణి కార్యక్రమాన్ని పట్టణ శివారులోని కమ్మ సంఘంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మాధవ సేవకంటే మానవ సేవ ముఖ్యమైందన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320 డీ రీజియన్ పరిధిలో ఏడాది పాటు వివిధ క్లబ్‌లు నిర్వహించిన సేవా కార్యక్రమాలకుగాను అవార్డులను అందజేశారు. చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈకార్యక్రమంలో రీజియన్ చైర్మన్ పల్లెంపాటి శ్రీధర్, ప్రతినిధులు ప్రకాష్, లక్ష్మి, విజయ లక్ష్మి, కోడాలి కిశోర్‌కుమార్, బసవేశ్వర్ రావు, కొయ్యాడ శ్రీనివాస్‌గౌడ్, లంక రవి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌సీ సెంటర్ సందర్శన


డీఆర్‌సీ సెంటర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గల డీఆర్‌సీ సెంటర్‌ను సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజు సందర్శించారు. డీఆర్‌సీ సెంటర్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వాల్ రైటింగ్స్‌ను ఆయన పరిశీలించారు. తడిచెత్త, పొడి చెత్త వేరు చేసి ఎరువులు తయారు చేసే విధంగా చూడాలని సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్‌కు సూచించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి ఉన్నారు.

వరిలో నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామరైతు వేదికలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారి సాయిరాంరాజ్ మాట్లాడుతూ ఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధి చింత శ్రీనివాస్ మాట్లాడుతూ డీఎస్‌ఆర్ పద్ధతి, తడి పొడి విధానం, డ్రమ్ సీడర్ పద్ధతిపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఆదాయం పెరుగుతుందన్నారు. వరి సాగులో కూలీల కొరతను అధిగమించడానికి ఈ పద్ధతులు అవలంభించాలని తెలిపారు. వరి సాగులో నీటిని ఆదా చేసుకునే పద్ధతులను రైతులు అమలు చేసుకోవాలన్నారు. వరిలో కలుపు తొలగించిన తర్వాత పొట్ట దశ వచ్చే సమయం వరకు ఎక్కువ నీరు అవసరం ఉండదన్నారు. కేవలం 45 తడులతో తడి పొడి విధానం పాటించి సాగు చేయవచ్చని సూచించారు నీరు వృథా కాకుండా యాసంగిలో పంట చివరి దశ వరకు పొలాలకు సాగు నీరు అందించవచ్చన్నారు. వరి పంట కొయ్యలను కాల్చవద్దని సూచించారు వాతావరణం, పర్యావరణంపై ఫౌండేషన్ కార్యక్రమం వివరాలు వివరించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు రాజేశ్వర్, శ్రీనివాస్, రాజశేఖర్, గంగాధర్, రంజిత్, దశరథ్, రాజేష్, రమేష్, చిన్న భోజన్న, మల్లయ్య, రంజిత్, సంతయ్య, తలారి జాన్ రాజు, నేరెళ్ల రాజేశ్వర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

పాలెం విద్యార్థుల క్షేత్ర పర్యటన


దొన్కల్‌లో క్షేత్ర పర్యటనకు వచ్చిన పాలెం యూపీఎస్ విద్యార్థులు

మోర్తాడ్: మండలంలోని పాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం క్షేత్ర పర్యటనలో భాగంగా దొన్కల్‌లోని ఉన్నత పాఠశాలను సందర్శించారు. డిజిటల్ విద్యా బోధన విధానం, గ్రంథాలయం, సైన్స్ ల్యాబొరేటరీ, కిచెన్ గార్డెన్ తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో దొన్కల్ ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్, ఉపాధ్యాయులు గంగామణి, మాణిక్యం, సురేష్, రాజ్‌నారాయణ, మధు, రఘునాథ్, సబిత, సవిత, సీఆర్‌పీ పరిమళ, పాలెం ప్రధానోపాధ్యాయురాలు ప్రమీలారాణి, ఉపాధ్యాయులు లత, లహరిక, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పూర్వ విద్యార్థుల చేయూత

మాక్లూర్: తమ స్నేహితురాలు అనారోగ్యంతో బాధపడుతోందని వైద్య ఖర్చుల కోసం పూర్వ విద్యార్థుల చేయూతనిచ్చారు. అడవి మామిడిపల్లి గ్రామానికి చెందిన అరుణ (చిన్నాపూర్) కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. చికిత్స కోసం డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈక్రమంలో పాఠశాల 2021- 22 పదోతరగతి పూర్వవిద్యార్థులు ఆమె ఇంటికి వెళ్లి వైద్య ఖర్చుల చికిత్స నిమిత్తం తల్లిదండ్రులకు రూ.42,000 అందించారు.


గ్రంథాలయాన్ని ఉపయోగించుకోండి

వేల్పూర్: మండల కేంద్రంలోని నిరుద్యోగులు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని గ్రంథ పాలకురాలు శ్వేత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు, పోటీ పరీక్షల కోసం చదువుకోవడానికి అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యలు శోచనీయం

వేల్పూర్: సీఎం రేవంత్‌రెడ్డిపై బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు శోచనీయమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన వేల్పూర్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కుల గణన సర్వేలో పాల్గొనని పార్టీ నాయకులు కులగణనను తప్పుపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రెండోసారి అవకాశం కల్పిస్తున్న కులగణన సర్వేలో కచ్చితంగా పాల్గొనాలని కోరారు. లేకుంటే బీసీలకు అన్యాయం చేసిన వారవుతారని విమర్శించారు.సమావేశంలో నాయకులు దామోదర్‌గౌడ్, బద్దం మహేందర్, రమేశ్, అశోక్, సతీష్, సుమన్ పాల్గొన్నారు.

తడిపొడి చెత్తపై అవగాహన



ఆర్మూర్‌టౌన్ : మున్సిపల్ పరిధిలోని 34వ వార్డులో మహిళలకు తడి, పొడి చెత్తపై సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్తను ఇంట్లోనే విభజన చేసి మున్సిపల్ చెత్త వాహనానికి మహిళలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డ్ ఆఫీసర్ వీణ, మెప్మా ఆర్పీ రజిత, కాలనీ మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలను సమర్థంగా ఎదుర్కోవాలి



రెంజల్(బోధన్): వార్షిక పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని కందకుర్తి హైస్కూల్ హెచ్ఎం ఖరీం పేర్కొన్నారు. సోమవారం పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షల సమయంలో ముందుగా భయాన్ని వీడాలన్నారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర ఆలయ ప్రాంగణంలో మహా శివరాత్రి సందర్భంగా ప్రతి ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు, కర పత్రాలను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు మేడిపల్లి శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, కాంగ్రెస్ నాయకులు దాసరి శ్రీకాంత్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు శివ లింగం గౌడ్, శాంతి కుమార్, మీనుగు రాజేశ్వర్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ తదితరులున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


వంటశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

ఎడపల్లి(బోధన్): గురుకుల పాఠశాలలో ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటశాల, సరుకుల నిలువ గది, పరిశీలించారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో పరిశుభ్రమైన తాగునీటిని అందించాలన్నారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. బయట నుంచి పాఠశాలలోనికి ఎలాంటి ఆహారం అనుమతించొద్దని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. ప్రిన్సిపల్ గంగశంకర్, ఎంఈవో మన్మోహన్ శాస్త్రి, ఉన్నారు.

‘ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలి’


మాట్లాడుతున్న రమేష్ బాబు

ఆర్మూర్‌టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. రమేష్ బాబు అన్నారు. పట్టణంలోని శాస్త్రి నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులు తమ ఓటును సరిగ్గా ఉపయోగించుకోవాలని కోరారు. బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం, కార్పొరేట్ సంస్థలకు లాభదాయకంగా చట్టాలను మారుస్తుందని ఆరోపించారు. సామాన్య ప్రజలపై ధరల భారం మోపుతోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతడి ఎల్లయ్య, టీ. భూమన్న, కుల్దీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రశాంత్‌రెడ్డి


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వేముల

వేల్పూర్: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఆధ్యాత్మికం

ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

వర్ని: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం వర్ని మండలం సేవాలాల్ తండాలో జగదాంబ మాత ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భోగ్ బండార్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో తండావాసులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి మాత విగ్రహ వార్షికోత్సవం


బాల్కొండలో అక్షరాభ్యాసం చేయిస్తున్న పండితుడు

బాల్కొండ: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ఉన్నత పాఠశాలలో సరస్వతి మాత విగ్రహ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు అక్షరాభ్యాసం చేపట్టారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామలక్ష్మీ, ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి , ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అపురూప వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు


విగ్రహాలకు చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

మాక్లూర్ : మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో గల అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముందుగా రోజువారి యాగశాలలో ఆలయ ప్రధాన పూజారి కుమారస్వామి ఆధ్వర్యంలో సుదర్శన నారసింహ మహాహోమం, పుష్పయాగం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంచి నీటి బావివద్ద దేవత విగ్రహాలకు చక్రస్నానం చేయించారు. ఆలయ ట్రస్ట్ చైర్‌పర్సన్ అమృతలత, ప్రభ, రమా, ప్రభావతి, సురేందర్‌రెడ్డి, ఆలయ ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)
స్క్రీన్-1 – నిదురించు జహాపనా(తెలుగు)-12.55, లైలా (తెలుగు)- 3.30 9.00, బ్రహ్మానందం(తెలుగు)-6.10, ఛావా(హిందీ)-9.15
స్క్రీన్-2 – కెప్టెన్ అమెరికా - 10.00, 1.00, 4.00, 7.00, 10.00
స్క్రీన్-3– లైలా -10.20, 1.10, 7.00, 9.50, సంక్రాంతికి వస్తున్నాం -4.00
స్క్రీన్-4 తండేల్(తెలుగు) - 10.00, 1.05, 4.10, 7.15, 10.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్-1 ఛావా(హిందీ)- 11.00, 1.40, 10.20, తండేల్(తెలుగు)-4.35, 7.30
స్క్రీన్-2 తండేల్(తెలుగు)-11.00,1.45,7.40, 10.20 -ఛావా(హిందీ)-4.30
స్క్రీన్-3 లైలా(తెలుగు)-10.45,1.45,7.35, 10.20, బ్రహ్మా ఆనందం(తెలుగు)- 4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1 కెప్టెన్ అమెరికా(తెలుగు)-10.45, 7.20 లైలా(తెలుగు)-1.25, తండేల్(తెలుగు)-4.15, 10.00
స్క్రీన్-2 ఛావా(హిందీ)-10.00, 4.00, 10.25 కెప్టెన్ అమెరికా(3డీ తెలుగు)-1.20 తండేల్(తెలుగు)-7.25
స్క్రీన్-3 తండేల్(తెలుగు)-10.30, నిదురించు జహాపన(తెలుగు)-1.35, లైలా(తెలుగు)-4.10, ఛావా(హిందీ)-7.00, సనమ్ తేరి కసమ్(హిందీ)-10.20
స్క్రీన్ -4 తల(తెలుగు)-10.55, సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-1.35, 7.40 - బ్రహ్మా ఆనందం(తెలుగు)-4.35 లైలా(తెలుగు)-10.40

లలితామహల్ తండేల్(తెలుగు)
దేవి లైలా (తెలుగు)
నటరాజ్ ఛావా(హిందీ)
విజయ్ సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,200	వెండి(కిలో)	1,05,000
22 క్యారెట్స్	81,400	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	180	మటన్	800